కథానిక :

# పగటివేషాలు

శ్రీ జయంతి శ్రీరామమూర్తి

రైలు బయలుదేరింది.

—"ఏయ్...ఏమిటలా తోసుకొస్తావ్? నీకు టిక్కెట్టుందా అసలు?" అన్నాడా గేటుదగ్గర నిలబడ్డ యువకుడు. ఆ సాధువు చలించలేదు.

"ఏం? ఏదీ నీటిక్కెట్టు? చూపెట్టు. లేకపోతే గొలుసు లాగి గార్డుని పిలుస్తాను..."

సాధువు ఏమాత్రం భయపడలేదు.

"ఎందుకయ్యా, అంత కోపం తెచ్చుకుంటావ్? చూసుకో ఇదుగో" అంటూ మొలలోంచి టిక్కెట్టు తీసేడు. ఆ యువకుడు కిమ్మనలేదు. బహుశా తన దబాయింపుకి తానే సిగ్గుపడివుంటాడు. అతనే కాదు. అతనితోబాటు ఆసాధువుని సందేహించినవాళ్లందరూ నిర్ఘాంతపోయారు. ఒక్కసారిగా వాళ్లందరికీ ఆసాధువంటే గౌరవం ఏర్పడింది. తక్కిన సాధువుల్లాగ, అతను రైల్వేవారికి అతిథి, అభ్యాగతుడు కాడని వాళ్ల మనస్సులు నిశ్చయించేయి.

"ఉన్నారు మహాత్ములు" అన్నాడు చెర్తుమూల బైఠాయించిన నాయుడుగారు.

"లేరు, మరీ" అన్నాడు ఆయనప్రక్కనున్న షావుకారు.

"తెల్లటి అంగీ, పంచా కట్టుకోడంతోనే కాలేదు. మనసులోని నలుపు పోవాలి. కోపాన్ని తమాయించుకోవడమే ధీరలక్షణం..." అంటూ సుక్కతిరకుండా చెబుతున్నాడు సాధువు. మిగిలినవాళ్లంతా చెవులప్పగించి నాగస్వరం ముందు పాము పడగల్లాగ ఏకాగ్రతను పొందుతున్నారు.

"అలా నుంచున్నారేం పాపం! ఇలా దయచెయ్యండి" అన్నాడు నాయుడుగారు. ప్రక్కనున్న షావుకారు కొంచెం జరిగేరు. సాధువు వచ్చి ఇద్దరిమధ్యా కూర్చున్నాడు. రైలు జరజరా ప్రాకిపోతూంది. బయట చీకట్లోంచి చల్లటి గాలి పెట్టెలోకి కొడుతూంది. ఆ చిరుచలి వాళ్ళకి సాధువుమీద కలుగుతూన్న భక్తిపారవశ్యాలకు దోహదంయిస్తోంది. ఎదుటి బెంచీమీద 'బాల' పుస్తకం చదువుతూన్న పంతులుగారు సులోచనాలు పైకెత్తి—

"తమ నామధేయం?" అన్నాడు.

"నన్ను దాసంటారు"...

"రామదాసా?"

"అలాగే...అలాగే..."

"తమ నివాసగ్రామం?"

"ఒక చోటేమిటి బాబూ? 'ఇందుగల డందు లేడని' అన్నట్లు... సాధువుకో చోటేమిటి?"

నాయుడుగారి భక్తి హెచ్చుతూంది. తనకు సంతానం కలగడానికి ఆశీర్వాదాలివ్వగల సమర్థుడు దొరికినాడని సంతోషిస్తున్నాడు.

"అయ్యా! నమ్మకండి, నమ్మకండి ఇలాంటి బైరాగుల్ని. మోసపోతారు" అన్నాడు గుమ్మందగ్గిర దాసుని అడ్డుపెట్టిన యువకుడు.

నాయుడుగారు సహించలేకపోయేడు.

"ఊరుకోవయ్యా! నిన్నెవ రడిగేరు? ఎందుకల్లా అరుస్తావ్?". అన్నాడుకోపంగా అదేసరసలో షావుకారూ రెండు మాటలందుకున్నాడు. రైలు వేగం హెచ్చుతూంది. దూరాన్న మెరుస్తూన్న దీపాలు వడివడిగా దృక్పథంలోంచి తప్పుకుంటున్నాయి. రాత్రి పదకొండయింది. మసకకళ్లతో షావుకారు.

"దాసుగారూ! విశేషాలేమన్నా చెప్పండి" అన్నాడు. దాసు నవ్వును గడ్డంలో దాచుకుంటూ

"ఏం చెప్పను? ఆ బయట వున్న కొండలు చూడండి. ఎంత భయంకరంగా వున్నాయో, వాటితో పోలిస్తే మన బ్రతుకులు ఎంత అల్పంగా కనిపిస్తాయ్"

ఆమాటలకే నాయుడుగారు శరీరాన్ని మరచిపోతున్నారు. ఆయనకి పిల్లలులేని కారణంచేత ధనంమీద ఎన్నడో విరక్తికలిగింది. కనుక వెంటనే అందుకున్నాడు:

"అవునండి. బ్రతికి నన్నాళ్లు డబ్బు డబ్బు అని కొట్టుకుచస్తాడు జీవుడు..."

దాసు మళ్లీ అందుకొన్నాడు.

"ఈనాడు జీవితంలో ప్రధానపాత్ర ధనం వహిస్తోంది. అందులో ఎంతో ప్రభావం వుంది. వెనకటికి ఒక భార్యా, భర్తా తమ ఏకైకపుత్రుని వెంటబెట్టుకుని ఓ నదిగట్టుని పోతున్నారట. చుట్టూ చాలా అందంగా వుందట. కాని నదిలోమాత్రం బురద, ప్రక్కన రెల్లుగడ్డి జీమూతంలాగ పెరిగివుంది. తల్లిదండ్రులు ఓ మూల నిలబడి చూస్తుంటే పిల్లాడు తప్పుకుని బురదలో దిగేట్ట. వాడి కేకలు విని వాళ్లిద్దరూ ఖంగారుపడి, నోరూ నెత్తీ కొట్టుకుంటున్నారు. ఆపిల్లాడు ఆగడ్డిలో చిక్కుకుపోయాడు. బురదలో దిగిపోయాడు. ఆనిర్భాగ్యులికి బ్రతుకే అంధకారంలా తోచింది. తోచదా మరి? కడకి వాళ్లూ అందులో దిగి ఆత్మహత్య చేసుకుందామని నిశ్చయించుకుంటున్నారు. ఇంతలో ఎక్కడినుంచి వచ్చేడో ఒక మహాత్ముడు వచ్చేడు ఆర్తత్రాణపరాయణునిలాగ. "ఆగండి" అన్నాడు. వాళ్లిద్దరూ ఆయనకాళ్లు పట్టుకుని ఏడిచేరు.

ఆ సాధువు రెండు నిముషాలు కళ్లు మూసుకుని వాళ్ల కేదో చెప్పి వెళ్లిపోయేడు. వెంటనే లేచేరు వాళ్లు. ఓ వెదురుబొంగు చివర రెండు రాగిడబ్బులు కట్టేరు. ఆ గడ్డిలోకి దూరంగా విసిరేరు. ఎవరో ఆ డబ్బుల్ని పట్టుకున్నట్లయింది. వాళ్లా కర్ర మెల్లగా లాగేరు. ఆశ్చర్యం! ఆ కర్రావే ఆ రాగిడబ్బులు వాడిచేతుల్ని ఆకర్షించేయి. మూడు ప్రాణాలు కాపాడేయి రెండు రాగికానులు...”

“ఆహాహా! ఎంత ఘనమైన కథ. ధన ప్రభావాన్ని అపూర్వంగా నిరూపించేరు దాసుగారూ...” అన్నాడు పంతులు బాల పుస్తకం మడుస్తూ.

“చాలా బాగుంది. ఇంకో కథ చెప్పండి” అన్నారు షావుకారు ఆవులిస్తూ. దాసుని గేటుదగ్గిర ఆపిన యువకుడు క్రింద కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. దాసు చూడలేక,

“అదేమిటి బాబూ! ఇలా కొంచెం మేను వాల్చు. నిద్ర నలా ఆపుకోకూడదు” అన్నాడు. యువకుడు దుప్పటి పరుచుకుని బెంచీలక్రింద మేను వాల్చేడు.

“మీరు సత్పురుషులు దాసుగారూ! మీరు గనక అత చిన్నమాటలు అంత త్వరగా మరచిపోయారు.”

అన్నాడు షావుకారు.

“ఏదో. మనలో యేముంది? ‘అపకారికి నుపకారము’ అని వూరికే చెప్పేరా పెద్దలు” అన్నాడు దాసు. నాయుడుగారు హోల్డాల్ మీద మోచెయ్యి ఆనుకుని, ఆవలిస్తూ చిటికెలు వేస్తున్నారు.

షావుకారు “ఇంకో కథ చెప్పండి” అన్నాడు.

“ఏం చెప్పను? ధన మనేది ఎంత వస్తువు. వచ్చిందా ఒకటే రావడం. పోయిందా అదే పోవడం. రెండూ మన చేతుల్లోనే వున్నాయి సుమండీ.” షావుకారుకళ్లు ధగధగలాడేయి. “అయితే, దాసుగారూ, ధనం ఎలా వస్తుందో చెప్పగలరా?” అన్నాడు.

“ఎలా వస్తుందేమిటి—‘తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు’ అన్నారు. అలాగే ప్రయత్నించి ఎంతైనా కూడబెట్టవచ్చు”... దాసు.

“అలాగ కూడబెట్టినవాళ్లెవరైనా వున్నారా?” అన్నాడు షావుకారు.

“చెబుతున్నా. మా వూళ్లో ఓ రైతుండేవాడు”...

“ఏవూళ్లో” అన్నాడు పంతులు పానకంలో పుడకలాగ.

“ఉండేది లెండి, నా చిన్నతనంలో ఓ వూరు...ఇప్పుడైతే యిలా పరారైనా గాని. ఆ రైతు చాలా జాగ్రత్తగలవాడు. అతను ఒకరోజు నాదగ్గిరికి వచ్చి ‘డబ్బు ఎలా కూడబెట్టాలి’ అని అడిగేడు. ఒక చిన్న ఉపదేశం చేశాను. అది చాలా చిన్నదే. నా ఉపదేశంప్రకారం వాళ్ల పెరట్లో వున్న మర్రిచెట్టు తొర్రలో అతను రోజూ అణావో, బేడో వేస్తుండేవాడు. లాభాలు వచ్చినప్పుడు రూపాయలు, అర్ధలూకూడా తనవి కావనుకునేవాడు. ఆమాట ఎవ్వరికీ చెప్పలేదు. నిజానికి అతనికికూడా తెలియదు మొత్తం ఎంత పడేసేడో. అలాగ దినాలు, నెలలు, సంవత్సరాలు గడిచేయి. ఆ వట వృక్షంకూడా అతనిగుట్టు బయటపెట్టలేదు. చివరికో రోజు వచ్చింది అతని వృద్ధాప్యంలో కొడుకులిద్దరూ అతన్ని ఇంట్లోంచి వెళ్ళిపొమ్మన్నారు. ఏం చెయ్యాలో తోచక రాత్రి వంటరిగా పెరటిలో కూర్చున్నాడు. ఇంతలో పెద్ద గాలి వచ్చి ఆ మర్రిచెట్టు మొదట్లోకి విరిగిపోయింది. ఏదో గలగల లాడితే లేచి నిలబడ్డాడు. చూస్తే ధనలక్ష్మి. సొమ్ము ఎత్తుకోడం మొదలు పెట్టేడు గోనిసంచులలోకి. ఎంత ఎత్తినా తరగదు...ఎన్ని వేలయిందో! చూసేరా, అతను సకాలంలో పడిన జాగ్రత్త అకాలంలో ఆత్మబంధువయింది. కనక మనోనిశ్చయం వుంటే ఎంత పేదవాడైనా ధనం నిలవ చెయ్యవచ్చు” అన్నాడు దాసు.

“ఆహాహా! కథలంటే యివే కథలు” అన్నాడు పంతులు.

“ఇది కథ కాదండి. నిజంగా జరిగిందే” ...దాసు.

“కావచ్చు. ఒక్కొక్కప్పుడు నిజాలే మంచి కథ లవుతాయి. సగంవంతా చెప్పడంలో వుంది” అంటూ ‘బాల’ పుస్తకాన్ని పైకి తీసేడు పంతులు. నాయుడుగారు హోల్డాల్ మీద ఆనుకుని గుర్రుపెడుతున్నారు. క్రింద పడుకున్న యువకుడు నిద్ర రాకనో యేమో ఇటూ అటూ దొర్లుతున్నాడు. షావుకారుగారికికూడా కళ్లు మూసుకుపోతున్నాయి. పంతులు పుస్తకం మూసి కిటికీతలుపుల్ని తల ఆనుకుని కళ్లు మూసుకున్నాడు. రైలువేగం హెచ్చుతూంది. దాసుకి క్రమంగా మాట్లాడేవాళ్ళుగాని మాట్లాడించేవాళ్ళు గాని దొరకలేదు. ఓసారి



అస్సాం గవర్నరుగ నియమితుడైన శ్రీ జయరాందాస్ 'దౌలత్రాం గారికి రిపబ్లిక్ అధ్యక్షుడు డా॥ రాజేంద్రప్రసాద్ మే 29 తేదీన ఉద్యోగపత్రమును ప్రసాదించిన దృశ్యం.

క్రింద పడుకున్న యువకుని వేపు తొంగి చూశేడు. అతడు మందంగా పొడిగా దగ్గేడు.

*　*　*　*

"ఇప్పుడు వెళ్ళిపోయిన స్టేషను పేరేమిటి!"

"వృద్ధాచలం" అన్నాడు ఆ స్టేషనులో క్రొత్తగా యెక్కిన యువకుడు. షావుకారు లేచి చుట్టాలిగిస్తూ—

"అరె...దాసుగారేరీ దిగిపోయారా!"

నాయుడుగారు కళ్ళు తెరచి "చెప్పకుండా దిగిపోయేరేం? ఇంకా ఆయనతో విషయం అడగుదామనుకున్నాను" అని దిగులుపడ్డారు.

"అవకాశాలు అప్రస్తుతమానం కలగవు. మహనీయులు కావలసినప్పుడెల్లా దొరకరు" అన్నాడు షావుకారు.

"అలాగే...అలాగే" అంటూ నాయుడుగారు నీళ్ల చెంబుకి చెయ్యి జాచేడు బల్లక్రిందకి. ఏదో మరచిపోయిన వానిలా ఉలిక్కిపడి, లేచి, టార్చిలైటు తీసి వెదకటం మొదలుపెట్టేడు.

"ఏమిటండీ" అన్నాడు షావుకారు.

"అబ్బే! ఏమీ లేదు. చెబుతా" అంటూ నాయుడుగారు పరిశోధన సాగిస్తున్నారు.

షావుకారు టైము చూడబోయి, చేతిని వాచీ కనబడక క్రింద పడిందేమోనని "లైటొకసారి యిలా యిస్తారా?" అన్నాడు.

నాయుడు నిరాశతో "నా చెంబు, మరచెంబు ఈ క్రింద పడుకున్న వెధవ కొట్టేసేడు." అనగానే "నా వాచీకూడా కనిపించటం లేదు. మొన్ననే చేయించుకున్నాను బంగారపుగొలుసు"—అన్నాడు షావుకారు దీనంగా. "నిస్సందేహంగా ఆ వెధవే. మంచికి పోతే చెడు యెదురౌతుంది. దాసు వాడిమీద దయచూపించి పక్షపాతం చేస్తే యిలా చేసేడు."

పంతులు కునికిపాట్లు మాని మందంగా వింటూ, తెలివి తెచ్చుకుని—

"క్రింద నా బూట్లలో గాని జారిపడిందేమో చూస్తాను?" అంటూ చెయ్యి చాపేడు. ఏది? బెర్తు క్రింద అంతా గాలే!! బూట్లుకూడా లేవు.

"అయ్యో! నిన్ననే కొన్నాను క్రొత్త బూట్లు. పదిహేను రూపాయలు. క్రొత్తవి. సరిక్రొత్తవి" అంటూ నిట్టూర్చేడు. వృద్ధాచలంలో ఎక్కిన మనిషి వింతగా చూస్తున్నాడు.

"ఇదంతా చూస్తే దాసే దీనికంతకీ కారకుడనిపిస్తోంది" అన్నాడు పంతులు.

"అబ్బే! దాసు అనుకోకూడదు. ఆ క్రింద పడుకున్న వెధవే కొట్టేసేడు." అన్నారు నాయుడు.

"నా వాచీ...బంగారపు గొలుసు" అంటూ చప్పరించేడు షావుకారు.

పంతులు మళ్ళీ "ఏమో, నా అనుమానం నాది. తెల్లటివన్నీ పాలు కావు. ఆ అతి వినయం చూస్తే అప్పుడే అనుకున్నాను" అన్నాడు.

"ఏమండోయ్! మీ బూట్లు పోతే పోయేయి గాని కళ్ళుకూడా పోతాయి దాసు మీద అనుమానం పడితే." అన్నాడు నాయుడు. ఆయన క్షణంలో ఆశీర్వాదాలు, పిల్లలు జ్ఞాపకం వస్తుంటాయ్. పంతులు ప్రారంభించబోతే "ఉన్నదున్నట్లు చెబితే మీ కెందుకీ కోపం మధ్య?" అన్నాడు.

"ఎందుకేమిటి? మీరు చూసేరా దాసు తియ్యడం?" అన్నారు నాయుడుగారు.

"ఎవరేనా ఈ రాత్రికి ముందు పగలు జరగడం మీరు చూచేరా అంటే మీ కేలా వుంటుంది?" అన్నాడు పంతులు.

వృద్ధాచలంలో ఎక్కిన యువకుడు అడ్డం వచ్చి—

"అయ్యా! ఎందుకింత వాగ్వాదం? మీ రెవరినిగురించి మాట్లాడుతున్నారు? ఆ వృద్ధాచలంలో ఈ పెట్టె నుంచి దిగిపోయిన వాళ్ళిద్దరి విషయమేనా? ఆ తెల్ల పంచమనిషి, గడ్డపతడు..."

"అవును ఆ సాధువు..." నాయుడు.

"అతడు సాధువు కాడు. వాళ్ళిద్దరూ పగటివేషాలవాళ్ళు. కొన్నిరోజుల్నించి మా వూళ్లో వేషాలు వేస్తున్నారు. వాళ్ళని నమ్మడం మీ తప్పు. అదుగో. అది చదవండి 'దొంగలున్నారు జాగ్రత్త' అని ఎలా రాసివుందో? ఆదమరచి ఎందుకు నిద్ర పోయేరు?"

అన్నాడా యువకుడు మళ్ళీ. షావుకారు, నాయుడు నిర్ఘాంతపోయేరు. తన బూట్లు పోయినా వాదం గెలిచినందుకు సంతోషించేడు పంతులు.

ఇంతలో రైలు ఒక చిన్న స్టేషనులో ఆగింది.

"పోనీ, ఇక్కడ దిగి వెనక్కి వెళ్ళి ఆ వెధవల్ని పట్టుకుందామా?" అన్నాడు షావుకారు. నాయుడు "నేను రాలేను. ఈ రైలులో వెళ్ళకపోతే నా మరచెంబుకి మూడు రెట్లు విలువగల పని తగలడుతుంది" అన్నాడు నిస్పృహతో.

షావుకారు అంతటితో నిరాశచెందక "పోనీ, పంతులుగారూ! మన ముద్దరం దిగి వెదదామా?" అన్నాడు.

వెళ్ళి ఏం చేద్దాం? ఈ పాటికి మన సామాను ఏ మద్రాసు రైల్లోనో పడి పోయి వుంటుంది"

"సరి ఏం చేద్దాం?"

గార్డు ఈల వేశాడు. పంతులు ముఖం లోపల పెట్టుకుంటూ "తూర్పు దిక్కేదో తెలుసుకుందాం" అన్నాడు.

రైలు మళ్ళీ బయలు దేరింది.

---


## నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిశ్శక్తి, నిస్సత్తువ ధ్వజనష్టమును హరించి బలమును కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని.

పెరిదేపి—నెల్లూరు జిల్లా.

## శ్రీ మద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు

పంచమ ముద్రణము : వెల రూ 4-0-0

(ప్యాకింగు, పోస్టేజి రూ 0-9-0)

సంస్కృత మూలము. శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారు వ్రాసిన తెలుగు టీకా తాత్పర్య విశేషార్థ వివరణలుగల 400 పుటల గ్రంథము. నిత్యపారాయణము చేయువారికి మిక్కిలి ఉపయుక్తమైనది. ఖద్దరు బైండు.

ఆంధ్ర గ్రంథమాల,

తపాలాపెట్టె 212, మద్రాసు.